క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో సోమవారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈఓ ఎస్.లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు.కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య,అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పోరుబాట విజయవంతం చేయండి

పగిద్యాల: జగనన్న గృహాల లబ్ధిదారులకు యూనిట్ విలువ రూ. 5లక్షలకు పెంచాలని చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫిబ్రవరి 6న చేపట్టిన కలెక్టరేట్ ధర్నాకు, ఫిబ్రవరి 22న విజయవాడలోని మహాధర్నాకు తరలి రావాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీం, పక్కీర్ సాహెబ్, ఖాదర్, మస్తాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేజ్, వార్డు సెక్రెటేరియట్ నూతన క్యాలెండర్ను తహసీల్దార్ రత్నరాధిక ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ వైపు ఇతర రాష్ట్రాలు చూస్తున్నాయని, మీ సేవలు ప్రజలకు మరింత భేషుగ్గా అందించాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా విలేజ్, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కలిముల్లా, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, పఠాన్బాబు, సర్వేయర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

పాములపాడు:లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ పాములపాడు గ్రామంలో 54 మంది లబ్ధిదారులున్నారన్నారు. ప్రస్తుతం బీబీఎల్ 8, బేస్మెంటు 29, రూఫ్ లెవెల్ 10, పూర్తయినవి 7 గృహాలు ఉన్నాయని చెప్పారు. ఉగాది పండుగ లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈలు శివరామకృష్ణారెడ్డి, రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పగిద్యాల: నందికొట్కూరు పట్టణంలోని సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో(సెబ్) సీఐ రమేష్కుమార్రెడ్డి సోమవారం తెలిపారు. 20 బైక్‌లు, ఒక ఆటోను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వం నిర్ణయించిన డిపాజిట్ చెల్లించాలన్నారు.

జీఓ నంబర్ 3 విడుదల హర్షణీయం

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలోని సివిల్‌సప్లయిస్ గోడౌన్ల వద్ద పనిచేస్తున్న హమాలీల కూలీ రేట్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్-3 ను విడుదల చేయడం హర్షణీయమని సీఐటీయూ నాయకులు డి.నాగరాజు, చిన్న మారెన్న అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ హమాలీల కూలీ రేట్లను పెంచాలని పలు మార్లు విజ్ఞాపనాలు చేయడం , ఆందోళనలు చేపట్టడంతో రాష్ట్రప్రభుత్వం హమాలీ కార్మికుల కోసం జీఓ నంబర్3ను తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఎమ్ మల్లికార్జున చిన్నమని, చిన్నప్రతాప్, జి.మల్లి, వెంకటేష్, శేఖర్, పోలయ్య, గాలెయ్య, ప్రభాకర్, వెంకటస్వామి, శ్రీనివాసులు ఉన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం

పగిద్యాల: అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతే ఆవాజ్ కమిటీ లక్ష్యమని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అబుబక్కర్ అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని ముబారక్ ఫంక్షన్ హాల్లో ఆవాజ్ కమిటీ తాలూకా స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రతకు భంగం వాటిల్లకుండా ప్రతి ఒక్కరితో సోదరభావంతో మెలగాలని సూచించారు. కుల మతాలకు అతీతంగా సేవలందించాలన్నారు. అనంతరం ఆవాజ్ కమిటీ సభ్యులు నూతన రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనా అబుబక్కర్, షేక్ అబ్దుల్లాను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రహిమాన్, సహాయ కార్యదర్శి మహబూబ్‌బాషా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, షేక్ అబ్దుల్లా, రఫీ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే

- మూడున్నరేళ్లలో 98 శాతం హామీల అమలు
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వెలుగోడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు: పాదయాత్రలో, ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలను మూడున్నరేళ్లలోనే 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీ నగర్, ద్వారకా నగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఈ మూడున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల దగ్గరకు వెళ్లే వారు ధైర్యంగా, గర్వంగా వెళ్లాలని, ఆ స్థాయిలో సీఎం జగన్ మమ్మల్ని నిలబెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు ఆరాధ్య దైవంగా నిలిచారని చెప్పారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏ ఒక్క మంచిపనైనా చేశారా? అని నిలదీశారు. ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. పలువురు తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పింఛన్లు కావాలని ఎమ్మెల్యేను కోరగా అక్కడిక్కడే సమస్యను పరిష్కరించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, వైస్ ఎంపీపీలు నసిరుద్దీన్, శంకర్‌నాయక్, ఎంపీటీసీలు చాంద్‌బాషా, రాజేష్, నాయకులు దేశం తిరుపంరెడ్డి, ముంతల విజయభాస్కర్‌రెడ్డి, అమీర్ అలీఖాన్, కే.రామ్మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, షంషీర్ అలీ, తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్‌లో చేప పిల్లల విడుదల

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేప పిల్లలను విడుదల చేశారు. మత్స్యకారుల శాఖ అభివృద్ధి అధికారి భరత్ లాల్ నాయక్ నేతత్వంలో 80-100 ఎంఎం సైజ్ కట్ల, రోహు, మిరాయాల జాతుల చేప పిల్లలను ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద విడుదల చేశారు.

భీష్మ ఏకాదశి వేడుకలను విజయవంతం చేయండి

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని కొలనుభారతిదేవి క్షేత్రంలో నిర్వహించనున్న భీష్మ ఏకాదశి వేడుకలను విజయవంతం చేయాలని శ్రీశారదా పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతీ స్వామి కోరారు. సోమవారం కొలనుభారతి క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం ఆయనకు పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ క్షేత్రంలో అమ్మవారి సన్నిధిలో శ్రీసద్గురు సరస్వతి నారాయణస్వామి ఆశీస్సులతో భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. అదే క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 3, 4 తేదీల్లో భీష్మ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నామన్నారు. వేడుకల్లో పాల్గొనే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

గాంధీజీ ఆశయాలు కొనసాగించాలి

ఆత్మకూరు: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు కొనసాగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ మోహన్‌కుమార్, బైర్లూటి, కొట్టాలచెర్వు పీహెచ్‌సీల వైద్యాధికారులు పవన్‌కుమార్, బెన్‌బురియన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి సభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అహింస, శాంతి మార్గంలో పయనించాలన్నారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

శ్రీశైలంప్రాజెక్ట్: అమరవీరుల త్యాగాలు మరువలేనివని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ బుచ్చయ్య అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ టి.రాజన్న, అధ్యాపకులు మహేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: తిమ్మాపురం పీహెచ్‌సీ ఆవరణలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ రమణ, ఎంపీహెచ్ఈఓ విజయారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ సికిందర్ పాల్గొన్నారు.



నందికొట్కూరులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

బాపూజీకి నివాళి

నందికొట్కూరు(పగిద్యాల): బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీజీ విగ్రహానికి వైద్య సిబ్బంది నివాళులర్పించారు. 30ఎన్‌డీకే52: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఆత్మకూరు: కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ మోహన్‌కుమార్, కుష్టు వ్యాధి నివారణ శాఖ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ నారాయణరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వ్యాధి నివారణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజం కోసం పాటుపడుదాం

జూపాడుబంగ్లా(పగిద్యాల): కుష్టు రహిత సమాజం కోసం పాటుపడుదామని జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగాధర్ పిలుపునిచ్చారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరోగ్య సిబ్బంది రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సబా, సీహెచ్ఓ వాహబ్, లెప్రసీ నోడల్ పర్సన్ రాముడు తదితరులు ఉన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే శిక్షార్హులు

పగిద్యాల: భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరమని, అందుకు శిక్షార్హులు అవుతారని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పాత ముచ్చుమర్రి ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

హక్కులను వినియోగించుకోవాలి

మహానంది: సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను వినియోగించుకోవాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి అన్నారు. మహానందిలోని ఈశ్వర్‌నగర్‌లో సోమవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ మమతారెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మహానందిలో అవగాహన కలిగిస్తున్న అధికారులు

చదువుల తల్లికి ఆర్థిక చేయూత

నందికొట్కూరు(పగిద్యాల): పదో తరగతిలో 503 మార్కులతో పాసై నంద్యాల ఆర్‌జీఎం కళాశాలలో ఇంటర్‌మీడియట్ చదువుతున్న టి.పవిత్రకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆర్థిక చేయూతనందించింది. సోమవారం 10 బొల్లవరం గ్రామంలో ఆ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వీరం మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని తల్లి లక్ష్మీదేవికి రూ. 5 వేలు నగదును అందజేశారు. విద్యార్థినికి నెలనెలా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు.

స్థలం కేటాయింపుపై హర్షం

ఆత్మకూరు: శ్రీశైలమహాక్షేత్రంలో మాదిగల నూతన అన్నదాన సత్రం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ ఆత్మకూరు మండల అధ్యక్షులు బుజ్జిమాదిగ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి శ్రీశైలంలో మాదిగలకు సత్రం నిర్మాణం కోసం స్థలం ఇవ్వాలని ఎన్నో సార్లు దరఖాస్తులు అందజేశామని తెలిపారు. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి శ్రీశైలంలో 50 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయించారని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్సీకు, స్థానిక ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దరగయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

జూపాడుబంగ్లా(పగిద్యాల): పండ్ల తోటల పెంపకం రైతులకు లాభసాటి వ్యవసాయమని జూపాడుబంగ్లా మండల ఉద్యాన అధికారి తేజశ్విని సూచించారు. సోమవారం మండలంలోని తంగడంచ రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏపీఐఐఏటీపీ పథకంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద వివిధ పంటలు సాగు చేసే రైతాంగానికి ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో మొక్కలు మంజూరు చేస్తుందన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

మిడుతూరు: ఉత్తమసేవలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని డాక్టర్ కిరణ్ కుమార్, ఎంపీహెచ్ఈఓ బాలసుబ్బారెడ్డి అన్నారు. తలముడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ మద్దిలేటి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. దీంతో ఆరోగ్యకేంద్రంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. డాక్టర్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ విలాసకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజల కష్టాలను చూసిన నాయకుడు జగనన్న

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- జలకనూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను చూసి.. ఆ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జలకనూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీజీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి వారి యోగక్షేమాలు అడుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామీణులకు అందుబాటులో ఉండేలా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటుచేసి ఇంటిముంగిటకే సేవలు అందజేస్తున్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది లేక పశువులకు వైద్యం అందడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పశువైద్య జాయింట్ డైరెక్టర్‌కు ఫోన్ చేసి లైవ్ స్టాక్ అసిస్టెంట్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షకూర్, కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్ధారెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, దాసి రాంపుల్లారెడ్డి, డాక్టర్ రఫీ, మున్నా, పుల్లయ్య, నాగటూరు సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గుండం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అల్లూరులో..

పగిద్యాల: నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆర్థర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నందున మండల స్థాయి అధికారులు ఆయా శాఖల అభివృద్ధి నివేదికలతో హాజరు కావలెనని కోరారు.

ఫేషియల్ అటెండెన్స్ నుంచి మినహాయించాలి

పగిద్యాల: మున్సిపల్ కార్మికులకు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. నాయకులు గోవిందు, నాగేశ్వరరావు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు నాగన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రణధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు దానమయ్య, సువర్ణమ్మ, సతీష్ పాల్గొన్నారు.

జీవో నం. 1ని రద్దు చేయాలి

పగిద్యాల: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నం. 1ని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నోటికి నల్లగుడ్డలు కట్టుకొని నందికొట్కూరులోని ఆత్మకూరు రోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు భాస్కరరెడ్డి, వేణుగోపాల్, అరుణజయ, నాగన్న పాల్గొన్నారు.

నందిపల్లె రైల్వేగేటు మూసివేత

మహానంది: నందిపల్లె గ్రామం వద్ద ఉన్న రైల్వేగేటును మంగళవారం నుంచి వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు తహసీల్దార్ జనార్దన్‌శెట్టి సోమవారం తెలిపారు. నందిపల్లె లెవెల్ క్రాసింగ్ గేట్ 188ఏ నందిపల్లె వద్ద మరమ్మతుల నిమిత్తం ఫిబ్రవరి ఆరవ తేదీ వరకు రైల్వేగేటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు సమాచారం అందించారన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

జూపాడుబంగ్లా(పగిద్యాల): రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించి ఆర్బీకేలో వ్రేలిముద్రలు వేయాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మండ్లెం రైతు భరోసా కేంద్రం పరిధిలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకలు బాలీశ్వర్, వినోద్, స్రవంతి తదితరులు ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

మహానంది: బుక్కాపురం సమీపంలోని శ్రీ సదానందాశ్రమంలో ఉన్న శ్రీ గంగా, పార్వతీసమేత శివాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతి సదానంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం ప్రతిష్ఠ ఉత్సవం, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటాయని ఆయన తెలిపారు.

రేపటి నుంచి గాజులపల్లె రైల్వేస్టేషన్‌లో..

గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగా, గౌరీ సమేత మరకతలింగేశ్వర, నవగ్రహాల దేవాలయంలో బుధవారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పగిద్యాల: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల డీసీహెచ్ఎస్ అధికారి డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రోగుల ఓపీ, డెంటల్ ఓపీ, ఆఫ్తాలమిక్ ఓపీ, కాన్పుల వార్డు, సెప్టిక్ లేబర్ గది, ఎస్‌బీఎస్‌యూ వార్డు, ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడుకు పలు సూచనలు చేశారు. 24 గంటలు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్లు ప్రసాద్ నాయక్, జక్కి, జయశ్రీ, సునీల్ కళ్యాణ్‌దేవ్ తదితరులు ఉన్నారు.



వార్డును పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా

గో సంరక్షణశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



గో సంరక్షణశాల వద్ద ధర్మకర్తల మండలిసభ్యులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి గో సంరక్షణశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గో సంరక్షణ నిపుణులతో సంప్రదించి వారి సూచనలు,సలహాలను పాటించాలన్నారు. బలహీన పడిన, జబ్బుపడిన గోవుల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆల య తూర్పుభాగాన నిర్మిస్తున్న ప్రధాన రహదారిని పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని అధి కారులకు సూచించారు. ధర్మకర్తల మండలి సభ్యులు నరసింహారెడ్డి, హనుమంత్‌నాయక్, విజయలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

'నాడు- నేడు'తో ఆస్పత్రుల అభివృద్ధి

మహానంది: నాడు- నేడు కార్యక్రమం ద్వారా విద్య, వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని సీనియర్ రీజనల్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆఫ్ ఎయిర్‌పోర్టు హెల్త్ ఆర్గనైజేషన్ డాక్టర్ అనురాధ మేడోజు అన్నారు. తిమ్మాపురం ఆరోగ్య కేంద్రంలో రాత్రి పది గంటల వరకు తనిఖీలు నిర్వహించి వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ అనురాధ మేడోజు మాట్లాడుతూ గతంలో ఆస్పత్రులు, పాఠశాలల్లో ఫర్నీచర్ కొనాలన్నా కష్టంగా ఉండేదని, ప్రస్తుతం నాడు-నేడు పథకం ద్వారా ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో దోమలు అధికంగా ఉన్నాయని, వాటి నివారణ కోసం వారం రోజుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విజయ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డాక్టర్ అనురాధ

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక అలంకార మండపంలో పూజల అనంతరం గోమాతను అలంకరించి పల్లకీ ముందు ఉంచి ఆలయ ప్రాకారాల్లో ప్రదక్షణలు చేయించారు. పూజా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1980-81 ఏడాది పదోతరగతి చదివిన బాల్యస్నేహితులు 41 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. సోమవారం మిత్రుడి ఇంట జరిగిన వివాహ వేడుకలో కలిశారు. చిన్ననాటి కబుర్లు చెప్పుకుని మురిసిపోయారు. కడమలకాల్వ గ్రామానికి చెందిన టీకేవీఎస్ భూషణ్‌కుమార్ కుమారుడి వివాహం శివనంది క్షేత్రంలో జరిగింది. దీంతో అప్పటి బ్యాచ్ మిత్రులంతా సుమారు 30 మంది పెళ్లికి హాజరై ఒకచోట చేరి కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.



పూర్వవిద్యార్థులు